పల్లెల్లో సీసీ కెమెరాలు


సీసీ కెమెరాల ఏర్పాటు కోసం అవగాహన కల్పిస్తున్న ఎస్సై గోగికారి ప్రసాద్ (ఫైల్)

- కెమెరాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న గ్రామస్తులు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టేకుమట్ల: నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారుతుంది. పట్టణాలతో పాటు పల్లెల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు అవగాహన కల్పిస్తుండడంతో ప్రజలు సహకరిస్తూ గ్రామాల్లో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో గ్రామాల్లో దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్న సందర్భంలో ఆధారాలు లేక పోలీసులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యేది. ప్రస్తుతం సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు, దొంగతనాలకు పాల్పడినా సులభంగా కనుక్కోవడానికి వీలుంటుంది. ఒక్క సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. టేకుమట్ల, రేగొండ మండల కేంద్రాలతో పాటు ఆయా మండలాల్లోని పలు గ్రామాలలో పోలీసుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్నారు. రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు పోలీసులు తెలుపుతున్నారు.


టేకుమట్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

సీసీ కెమెరాలతో ఛేదించిన కేసులు..

- ఇటీవల టేకుమట్ల మండల కేంద్రంలోని ఓ పంక్చర్ కొట్టులో హోటల్ నిర్వాహకులు గ్యాస్ సిలిండర్‌ను చోరీ చేయగా సీసీ ఫుటేజీ ఆధారంగా వ్యక్తి నుంచి సిలిండర్‌ను తిరిగి స్వాధీనం చేసుకున్నారు.
- గత నెలలో మండల కేంద్రానికి చెందిన ఓ మహిళను ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టి పారిపోవడంతో, మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గల సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- రేగొండ మండలంలోని మడ్తపల్లిలో బంగారం చోరీ కేసులో పోలీసులు నిందితులను పట్టుకున్నారు.
- రేగొండ మండలంలోని దమ్మన్నపేటలో మెడికో విద్యార్థి అనుమానాస్పద మృతిని సీసీ ఫుటేజీ ఆధారంగా కేసును ఛేదించారు.
- ఇటీవల రూపిరెడ్డిపల్లిలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ట్రాక్టర్‌తో పరారైన వ్యక్తిని పోలీసులు గుర్తించారు.
- చిట్యాలలో నకిలీ మావోయిస్టుల పేరుతో వెలసిన వాల్ పోస్టర్‌లను సీసీ ఫుటేజీ ఆధారంగా ఛేదించి, నిందితులను పట్టుకున్నారు.
- టేకుమట్ల మండల కేంద్రంలో ఎలక్ట్రీషియన్ వద్దకు మరమ్మతు కోసం తీసుకువచ్చిన వ్యవసాయ బావి మోటార్ చోరీ కావడంతో సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు.

ధైర్యంగా ఉంటున్నాం..



గతంలో పల్లెల్లో దొంగతనాలు ఎక్కువగా ఉండేవి. ఏదైన దొంగతనం జరిగిందంటే ఎలాంటి ఆధారాలు లేకుండా ఉండేది. ఇప్పుడు సీసీ కెమెరాల ఏర్పాటుతో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తే ఎవరైనా దొరికిపోతారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు కూడా తగ్గిపోయాయి. బస్టాండ్ ఆవరణంలో మాకు పండ్ల దుకాణం ఉంది. సీసీ కెమెరాలు ఉండడం వల్ల పండ్లను రోడ్డుపైన్నే ఉంచుతున్నాం. సీసీ కెమెరాల వల్ల ధైర్యంగా ఉంటున్నాం.

– సరిగొమ్ముల ప్రభాకర్, పండ్ల వ్యాపారి, టేకుమట్ల

అవగాహన కల్పిస్తున్నాం..



మండలంలో ఇది వరకు కొన్ని గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించి పలు గ్రామాల్లో ఏర్పాటు చేశాం. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ప్రజలు సహకరిస్తున్నారు. తప్పకుండా త్వరలోనే మండలం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉండబోతుంది.

– గోగికారి ప్రసాద్, ఎస్సై, టేకుమట్ల

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కాటారం: మహాముత్తారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు స్టైకింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం లావుడియా ప్రకాశ్‌నాయక్ శనివారం తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన అథ్లెట్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న చేగువేరా, శివవర్ధన్, రవిచంద్రన్ స్టైకింగ్ విభాగంలో ప్రతిభ కనబర్చారు. దీంతో నిర్వాహకులు వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల పీడీ జ్యోతి, ఉపాధ్యాయులు హట్కర్ దేవ్‌సింగ్, రామ్‌సింగ్, రజని, మంజుల, రఘుపతిరెడ్డి, జయమధూకర్‌రావు అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మొగుళ్లపల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలలో సైబర్‌నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సమావేశంలో స్కూల్‌సిబ్బంది, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేటీఆర్ సేన సోషల్ మీడియా అధ్యక్షుడిగా కాడపాక రమేశ్ ఏకగ్రీవంగా నియమించారు. ఈ మేరకు శనివారం కేటీఆర్ సేన నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు జన్నె శ్రీకాంత్ నియామక పత్రం అందజేశాడు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ సేన నాయకులు క్రాంతి, ఆనంద్, సుమన్, కుమారస్వామి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

5జీతో నిరంతర సేవలు

ఏటూరునాగారం: మండల పరిధిలోని ఐటీడీఏ కార్యాలయంలో 5జీ సేవలను అంతరాయం లేకుండా నిరంతరం అందించనున్నట్లు బీఆర్ నెట్వర్క్ ఎంఎస్ఓ చెన్న భిక్షపతి తెలిపారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రైవేట్ నెట్వర్క్ వారు 5జీ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించారు. ఎలాంటి ఆలస్యం లేకుండా వేగవంతంగా సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.

విజయవంతం చేయాలి

చిట్యాల: బీహార్ రాష్ట్ర అర్రా పార్లమెంట్ సభ్యుడు కామ్రేడ్ సుదామ ప్రసాద్ ఈ నెల 6న యాదాద్రి జిల్లాలోని ఆలేరు పర్యటనను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారేపెల్లి మల్లేశ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తుందని తెలిపారు.

హమాలీ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

పరకాల : అనారోగ్యంతో మృతిచెందిన పరకాల వ్యవసాయ మార్కెట్ హమాలీ కార్మికుడు బొట్ల మొగిలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని హమాలీ సంఘం అధ్యక్షుడు లంకదాసరి అశోక్ డిమాండ్ చేశారు. మొగిలి మృతికి సంతాపంగా ఆదివారం మార్కెట్ బంద్ పాటించాలని కార్మికులు కోరారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు కె.ఐలయ్య, కె.శంకర్, డబ్బా రాజయ్య, కె.శంకర్, ఎం.రవి, బి.భద్రయ్య, కె.యాదగిరి పాల్గొన్నారు.

'మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి'

దామెర : ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని బీజేపీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు అన్నారు. మండలంలోని దుర్గంపేట్‌లో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీజేపీ సభ్యత్వం పొందుతున్నారని అన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని అన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి


పప్కాపురంలో గ్రామస్తులతో ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: ప్రజల సమస్యలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. శనివారం మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎస్పీ శబరీష్, సీఐ అనుముల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి వారి సమస్యలను ఎస్సై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామాల్లో మురుగు కాలువలు, రోడ్లు, మంచినీటి సమస్య, విద్యుత్ సరఫరాలో అంతరాయం, లోవోల్టేజీ సమస్యలు, బస్సు సర్వీసులు నడిపించాలని ప్రజలు కోరినట్లు తెలిపారు. అర్హులైన యువతకు డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించేందుకు ప్రత్యేక మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని, వాటి నివారణ కోసం వైద్య ఆరోగ్య శాఖతో మాట్లాడుతానని ఎస్సై హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసులు గ్రామస్తులు శివ, మంజుల, రాజ్‌కుమార్, రాములు, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం


ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

రేగొండ: ఇసుక అక్రమ రవాణా చేస్తూ ఐదు ట్రాక్టర్లు పట్టుబడిన సంఘటన మండలంలోని చెన్నాపూర్ శివారులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చిట్యాల, టేకుమట్ల మండలాలలోని మానేరు, చలివాగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను పరకాలకు తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను చెన్నాపూర్ శివారులో సీసీఎస్, సివిల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. అలాగే చెన్నాపూర్ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన మూడు ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక డంపు చేసిన, నియోజకవర్గ పరిధి దాటి అక్రమంగా ఇసుక రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


ఏటూరునాగారం: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల, డిగ్రీ కళాశాలల విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. హాస్టల్ మెస్ చార్జీలు, కాస్మోటిక్స్ చార్జీలు 40శాతం వరకు పెంచడంతో విద్యార్థులు ఆనందోత్సవాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

చార్జీల పెంపుపై హర్షం వ్యక్తం


కాటారం: ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కాటారం: గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ శనివారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్లడం సంతోషకరమన్నారు. విద్యార్థులందరు ప్రభుత్వానికి రుణపడి ఉంటామని అన్నారు.

'అక్రమ వసూళ్లకు పాల్పడలేదు'

కాటారం: దళితబంధు పథకానికి సంబంధించి తాను ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడలేదని కాటారం మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు మావోయిస్టులు విడుదల చేసిన లేఖలో నిజం లేదన్నారు. 2009 నుంచి కొనసాగుతున్న తన రాజకీయ జీవతంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని ప్రజల్లో మంచి పేరుతెచ్చుకున్నానని తెలిపారు. తనను వార్డు సభ్యుడిగా, ఎంపీటీసీగా, తన తల్లిని ఎంపీటీసీగా, వైస్ ఎంపీపీగా ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించి సేవ చేసే అవకాశం కల్పించారని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడి ఉంటే ప్రజలు తన రాజకీయ జీవితానికి ఎప్పుడో సమాప్తం పలికేవారని అన్నారు. దళితబంధు విషయంలో వసూళ్లకు పాల్పడినట్లు నిరూపిస్తే ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ సాక్షిగా తనకు ఏ శిక్ష వేసిన ఒప్పుకుంటానని తెలిపారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్చుకోలేక కొంత మంది దురుద్దేశ్యంతో తనపై తప్పుడు ప్రచారాలు చేసేలా ప్రేరేపిస్తున్నారని అన్నారు.

ఆర్థికసాయం అందజేత

దామెర : అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు తోటి మిత్రులు. మండల కేంద్రానికి చెందిన కదం రవి గతంలో గుండెపోటు రావడంతో వైద్యులు బైపాస్ సర్జరీ చేశారు. కోలుకుంటున్న క్రమంలో ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. విషయం తెలుసుకున్న తనతో పాటు డిగ్రీ చవుతున్న సమయంలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్న మిత్రులు అండగా నిలిచారు. రూ. 50,800 పోగుచేసి శనివారం ఫోన్ పే ద్వారా రవికి అందించారు. సాయం చేసినవారిలో మాజీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు సీతారాంనాయక్, బాలస్వామి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అశోక్

ఏటూరునాగారం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్ అన్నారు. శనివారం మండలంలోని గోగుపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆమోదిత ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సంఘం సీఈఓ అల్లి గౌరమ్మ, డైరెక్టర్ వంగపండ్ల రవి, సిబ్బంది అజ్మద్‌పాషా, సింగిరెడ్డి శ్రీరాములు, శేఖర్‌రెడ్డి, యాదగిరి, రాంబాబు, చంద్రారెడ్డి, కామండ్ల కుమార్, మల్లారెడ్డి, భూపాల్, వెంకన్న పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం


చెక్కు అందజేస్తున్న సంఘం నాయకులు


కాటారం: మండలంలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆధునిక సీసీ కెమెరాల ఏర్పాటుకు అన్ని వర్గాల ప్రజలు తోడ్పాటును అందిస్తున్నారు. మండలంలోని వాణిజ్య, వర్తక, వ్యాపార వర్గాలతో పాటు ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు తమ వంతు సహకారం చేకూరుస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో రూ.2,01,116లు విరాళంగా ప్రకటించారు. ఈ చెక్కును సంఘం సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్‌కు అందజేశారు. కిరాణావర్తక సంఘం నాయకులు స్వచ్ఛందంగా తమ సహకారం అందించడంపై సీఐ, ఎస్సై వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కలికోట శ్రీనివాస్, గంగిరెడ్డి లచ్చిరెడ్డి, దారం నగేశ్ కుమార్, మద్ది నవీన్, దారం నందకిశోర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి


సర్టిఫికెట్లను అందజేస్తున్న నాగరాజు

ఏటూరునాగారం: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని అంబేడ్కర్‌నగర్ పాఠశాలలోని విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్, క్రీడా సామగ్రి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు డంబెల్స్, ముద్దార్ తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి తాను ఎంతో కష్టపడి పైకి వచ్చానన్నారు. తల్లిదండ్రులు మనల్ని చదవించేందుకు వారికి కృతజ్ఞత తీర్చుకోవాలన్నారు. పేద విద్యార్థులకు తన వంతుగా సాయం చేస్తా అన్నారు. ఎంబీబీఎస్ సీట్ సాధించిన జనగాం రాజేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయులు సాలం సత్యం, పర్వతల కుమార్, పత్రి కిరణ్, అంబరకాని జయమ్మ, రాజేంద్రకుమార్, నీలమ్మ, సురేష్ కుమార్, అల్లి నగేష్, షేక్ సాదిక్ పాషా, కందకట్ల సుధాకర్, గోగు మల్లయ్య, శ్రావణ్, జనగాం రాజేష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు



రేగొండ మండలంలోని లింగాల-కొడవటంచ ప్రధాన రహదారి పక్కన ఎండిపోయిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. ఆ చెట్టు ఎప్పుడు కూలుతుందో అని ప్రయాణికులు భయపడుతున్నారు. రోడ్ల వెంట ఎండిపోయిన చెట్లను ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు గుర్తించి తొలగించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరుగకముందే రోడ్ల వెంట ఉన్న ఎండిపోయిన చెట్లను గుర్తించి తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– రేగొండ

వైభవంగా కార్తీక దీపోత్సవం


రేగొండ: దీపారాధనలో పాల్గొన్న భక్తులు

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో పెద్ద ఎత్తున మహిళలు, దంపతులు పాల్గొని సామూహిక దీపారాధన చేశారు. ఆలయ అర్చకులు భక్తులతో తొమ్మిది సార్లు దీపమంత్రం పలికిస్తూ లక్ష్మీ నీరాజనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బుచ్చమాచార్యులు, శ్రీనివాసచార్యులు, శ్రీనాథ్, ఆలయ సిబ్బంది శ్రావణ్, సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.


ఏటూరునాగారం: దీపాన్ని వెలిగిస్తున్న అర్చకులు

ఏటూరునాగారం: మండలంలోని శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తీక మాసం తొలిరోజు సందర్భంగా ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపాన్ని ఆలయ అర్చకులు రాజ్‌కుమార్, ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్‌లను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో ధ్వజస్తంభానికి తాడుకట్టి ఒక చిన్న పాత్రలో దీపం వెలిగించి భగవంతుని నామాలు చెబుతూ ఆ దీపాన్ని పైకెత్తారు. అలాగే శివలింగాకారంలో దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కిరణ్, తిరుపతి, రామాలయం చైర్మన్ అలువాల శ్రీనివాస్, గ్రామస్తులు ప్రవీణ్, పాలకుర్తి ప్రవీణ్, శ్రీను, రెడ్డి ప్రమీల, వేణుగోపాల్‌లాహోటి తదితరులు పాల్గొన్నారు.


శివలింగాకారంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

హామీలను నెరవేర్చాలి

శాయంపేట : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కళాకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఉత్తర తెలంగాణ మహిళా కళాకారుల కన్వీనర్ వైద్యుల రజిత శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారులు కీలక పాత్ర పోషించారని, గత ప్రభుత్వం కళాకారులను పట్టించుకోకుండా అన్యాయం చేసిందని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సాంస్కృతిక సారథిలో వెయ్యి ఉదోగాలు ఇవ్వాలని, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీం కింద రూ.10 లక్షల సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధ కళాకారులకు రూ.25 వేల పెన్షన్, ఇళ్లు లేని కళాకారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఈనెల 5న వరంగల్ రైల్వే స్టేషన్, బాపూజీ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే జిల్లా ఉద్యమ కళాకారుల సదస్సులో కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.